"లీ! లీ!"

ఒక్క క్షణంలో లీ వచ్చి అతని చేతుల్లో వాలింది. ఆ పిల్లను గట్టిగా తన హృదయానికి హత్తుకున్నాడు. లీ గుండెలు పగిలేటట్టు యేడువ దొడగింది అతన్ని వాటేసుకుని. రామన్న కాంతి విహీనమైన నయనాలు లీ తలమీద వర్షించాయి.

"అమ్మేది లీ? అమ్మేదీ"?

లీ జవాబు చెప్పలేక మరీ బిగ్గరగా యేడ్చింది. ఆ దృశ్యం చూచి, ఆ జపాన్ తాతిగుండె కూడా చలించింది.

"రామన్నా! యాంగ్ యీ దుర్మార్గుల వాతబడి నిన్నే మరణించింది." స్త్రీలలోనుండి, ఒక విషాదధ్వని వచ్చి అతని కర్ణభేరికి తగిలింది.

రామన్న లీని యెత్తుకున్నాడు; సైనికుడి దగ్గర సెలవు తీసుకున్నాడు: తిరుగు మొహం పట్టాడు.

# ★ చూపులు కలిశాయి ★

డి. వి. ల.

"నీలాల్చి చూస్తోంటే నాకో సంగతి జ్ఞాపకం వస్తోంది."

"ఏసంగతి? ఎప్పటి బాపతు!"

"మొన్న మొన్న లే!"

"అంటే?"

"సుమారు సంవత్సరం క్రితం మాట."

"చంపావు, ఏమిటి అసలు గొడవ?"

"అс...ఏంలేదులే. చెబితే చిన్న గ్రంథమై ఊరుకుంటుంది."

"అయితే త్వరగా బైట పారెయ్యి. ఆలస్యం అమృతం విషం అన్నారు పెద్దలు"

"అంత ఖంగారు ఎందుకంటా?"

"ఊ...ఊ... మొదలెట్టు."

"అబ్బే ఏంలేదు. ఆరోజున బొగ్గు బస్సులో బయలుదేరానా-ప్రక్కనే ప్రేల్చాడా ననుకో."

"వెధవ చెప్పడంలా ఉంది-ఆరోజు అంటే ఏరోజు? ఎప్పుడు? ఎక్కడ? ఎందుకు?"

"వినేవాడికి చెప్పేవాడం లోకువ - వెధవ ప్రశ్నలు-ఏరోజు బయలుదేరిందీ ఎక్కడ జ్ఞాపకం ఉంటుందీ?"

"ఇంతకీ చంపక చెప్పు, బస్సుప్రక్కన నుంచున్నవాడివి జారిపడ్డా నంటావు."

"అబ్బే! ఘటాన్ని సవ్యంగానే స్టేషన్కి చేరేశాను."

"అయితే ఏం జరిగింది?"

"ఏం జరుగుతుంది బొగ్గు బస్సుకి-మితిమీరి భుజిస్తే అజీర్ణవ్యాధి చక్క వస్తుందన్నారు. అసలే బొగ్గు బస్సు-అందులో జనం ఎక్కువై కుచేల సంతానంలా ఇరుప్రక్కలా ప్రేల్తాడుతుంటే ఓవర్లోడు ఐ టైరు పేలిపోయింది."

"సరే అప్పుడేమైంది?"

"ఎల్లాగో రాత్రి ఒంటిగంటకు అంటే మర్నాడు క్రింద లెక్కలే, స్టేషనులో పడ్డాను."

"వింటున్నాను."

"టిక్కెట్టు కొనడం మొదలయిన విషయాలు ఎందుకుగాని రైలు ఎక్కాననుకో, మూడవ తరగతే లే."

"ఊ...మనకి అంతకంటె ఎక్కువ ఎందుకులే. టిక్కెట్టు కొనడం దగ్గరనుంచి మొదలెట్టి చెప్పావంటే నా ప్రాణాలు తీస్తావు. సరే... తరువాత."

"అప్పటికి నా స్థితి ఎట్లా ఉందో చెప్పద్దూ కొంచం."

"ఎట్లా ఉందేమిటి? గంటలమీద ఉన్నావా, నిముషాలమీద ఉన్నావా?"

"ఛ...ఛ. ఎంతమాట. శాస్త్ర సాహిత్య ధోరణి- పుస్తకాల పరిచయం, ఇత్యాదులు."

"మై గాడ్! 'స్థితి' అంటే చచ్చిపోయేటంత పని జరిగిందనుకున్నా."

"సరే రైలు కదిలిందనుకో. నేను కూర్చున్న సీటు కెదురుగా ఓ అమ్మాయి కూర్చుని ఉంది. ఇరవై ఏళ్లుండొచ్చు."

"అమ్మాయే ఉంది. అమ్మాయి లేకుండా ఏదీ ఉండదు- కానీ."

"సూక్ష్మంగా చెప్పాలంటే మనిషి ఓ మాదిరిగా ఉందిలే."

"అయితే మనకి అందచందాలతో నిమిత్తం లేదుగా !"

"ఏడిశావు. రైలు కదిలిందా- కదిలిన పది నిముషాల తర్వాతనుంచీ ఆ అమ్మాయి నాకేసి చూడడం మొదలెట్టింది."

"ఆఁ...నీకేసే ! నీకేసి చూసే ఓ అమ్మాయి యీ కలియుగంలో ఉందంటావు !"

"నీ మొహం. నీకేం తెలుసు ! నేను సంగతి ఏమిటో తెలుసుకోవాలని మళ్ళీ ఆ అమ్మాయి కేసి చూడడం మొదలెట్టాను."

"వింటున్నాను."

"ఇంకా అల్లాగే చూడడం మొదలెట్టింది. నాకు ఒక్కసారి మహాకవుల గ్రంథాల్లోని ఘట్టాలు కళ్ళముందు పరుగులుతీశాయి. కాళిదాసు, షెక్స్పియరు ఇంకాఇంకా ఎంతమందో."

"వీళ్ళంతా ఎందుకు జ్ఞాపకం వచ్చారు?"

"ఒఠ్ఠి చవటవి. నీకు ఏమీ తెలియదు. ప్రణయ సాధనకి మొట్టమొదటిమెట్టు చూపుల కలయిక అన్నారు పెద్దపెద్ద కవులు. ఒక్కసారి ప్రేమగాథలు అన్నీ జ్ఞాపకం వచ్చాయి."

"వెధవ ప్రణయంలా ఉంది, నువ్వూ నీ ధూమశకట ప్రణయమూనూ! సరే ఏం జరిగింది తరువాత?"

"నీకీ విషయాలు అనుభవం లేదోయి, వెధవాయి! రెండవ ఘట్టంలో మాట్లాడడం జరగాలి. అందుచేత ఏతత్ కార్యసిద్ధికై చెయ్యవలసిన సన్నాహాలు ఏమిటా అని ఆలోచనలో పడ్డాను."

"అప్పుడేం చేశావు?"

"ఏం చెయ్యను! ముందు పుట్టు పూర్వోత్తరాలు తెలుసుకోవడం మంచి దనుకొన్నాను. ఆ అమ్మాయి తాలూకు మనిషి ఒకడు నాప్రక్కన కూర్చున్నాడు. వయసు మళ్ళిన వ్యక్తే."

"ఉంటే, ఏమైంది?"

"అతన్ని ముందు పరిచయం చేసుకోవా లను కొన్నాను. మొదట ఏవూరు అని ప్రశ్నించాను ఏదో పల్లెటూరు చెప్పాడు."

"తరువాత! తరువాత!"

"ఎక్కడికి వెళుతున్నారన్నాను-ఏదో కొత్తవలస అన్నాడు."

"ఊఁ. ఊఁ."

"ఈ సమాధానాలవల్ల నాకు పెద్ద ఉపయోగం కనపడలేదు. ఆమనిషి చాలా ముక్తసరిగా సమాధానం ఇవ్వడంవల్ల ఇంకా ప్రశ్నలు వెయ్యడానికి కాస్త సందేహం తోచింది."

'ఐతే అప్పుడు ఏం చేశావు?"

"ఆఖరుకి ఏమైతే ఐందని ఆవూరు "ఎందుకు వెళుతున్నారన్నాను. అతను వెంటనే ఆవూళ్లో ఒక వైద్యుడున్నాడండి అతని వద్దకు వెళుతున్నా"నన్నాడు. సరే బండిబాగానే దోవలో పడుతోందనుకొని ఏం వైద్యుడు, వైద్యం ఎవరికి మొదలయిన ప్రశ్నలవర్షాన్ని కురిపించాను, కాస్త సందు దొరికింది కదా అని."

'ఆ పెద్దమనిషి ఏమన్నాడు ?"

"'భూతవైద్యుడండి. ఏదేనా గ్రహబాధవల్ల మతి స్థిరం తక్కువైనవాళ్ళకి నయం చేస్తాడు. చాలామందికి కుదిరింది' అన్నాడు. ఈమాటలు వింటూంటే నాకు ఇంగారు ఎక్కువై ఎవరికి మతిస్థిరం తక్కువండీ అన్నాను ఆత్రతగా."

"ఊ...ఏం చెప్పాడాయన ?"

"ఏం చెప్పను. 'ఆ అమ్మాయికి మతిస్థిరం లేదండి ఎవరితోటీ మాట్లాడదు. ఎంతసేపేనా అల్లా ఊరికే చూస్తూ ఉంటుంది అందరికేసీ, అంతే. మన ధోరణే లేదు' అన్నాడు ఇంకా ఏదో చెప్పబోతున్నవాడిలా"

"బలే. మంచి గ్రేడు తిన్నావన్నమాట. ఖూనీ అయిపోయావు."

"నా మొహం కందింది. మాట రాలేదు... ఆ...ఆ...ఏమిటది అంటూంటే రైలు ఆగింది. 'ఈ స్టేషన్లోనే దిగాలండి ఆ వూరు వెళ్ళడానికి,' అంటూ లేచివెళ్లారిద్దరూ."